ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ సోమవారం 25 మార్చి 2024

ప్రారంభానికి నోచుకోని నీరుకుళ్ల మానేరు వంతెన

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సవరించాలి

8లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:27 సోమవారం

సహర్ 4:47 మంగళవారం

సాగునీటి కోసం తండ్లాట



నీరులేక వెలవెలబోతున్న మానేరు వాగు

- ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతాంగం
- అడుగంటుతున్న బోర్లు, అందని కాలువ నీళ్లు
- మంథని, ముత్తారం, రామగిరిలో సుమారు వెయ్యి ఎకరాల్లో ఎండిన పంటలు

మంథని, మార్చి 24: చివరి దశలో ఉన్న తమ పంట పొలాలను కాపాడుకోవటానికి మంథని ప్రాంతంలోని టేల్యాండ్ రైతాంగం సాగునీటి కోసం తండ్లాడుతున్నారు. ఎస్సారెస్పీ కాలువ నీళ్లు అందక ఆయకట్టు చివరి భూముల్లో వందలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతున్నాయి. ఎండలు ముదురుతుండటతో పాటు భూగర్భ జలాలు అడుగంటి పోతుండంతో బోర్లు సైతం పనిచేయడం లేదు. మరోవైపు కాలువ నీళ్లు రావడంతో లేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో సాగునీరులేక వరి పంటలు ఎండిపోయాయి. పొలాల్లో నెర్రెలు బారాయి. రైతుల చేతి కష్టం, వేలాది రూపాయాల్లో పెట్టుబడులు వృధా అవుతున్నాయి. దీంతో 15 రోజులుగా మంథని ప్రాంతంలో రైతులు సాగునీటి విడుదల కోసం ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో మంథని మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో, ముత్తారం మండలంలో రైతులు సుమారు 10 వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేస్తున్నారు. మంథని మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, మైధుపల్లి, పుట్టపాక, ముత్తారం, రామకిష్టాపూర్, సీతంపల్లి, ఖమ్మంపల్లి, రంగయ్యపల్లి, శుక్రవారంపేట, రామగిరి మండలంలోని రాజాపూర్, రామయ్యపల్లి, బేగంపేట గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల వరకు సాగునీరు అందక టేల్యాండ్ ప్రాంతాల్లోని వరి పంటలు ఎండిపోయాయి. మరికొన్ని ఎండిపోయే దశలో ఉన్నాయి. వీటిని, గొలుసు వేసిన వేలాది ఎకరాల్లో ఉన్న వరి పంటలను కాపాడుకోవటానికి రైతులు ఆందోళన బాట పట్టారు. ఎండిపోతున్న ఆయా గ్రామాల రైతులు 15రోజుల్లో మంథనిలో రెండుసార్లు సాగునీటి కోసం పెద్దఎత్తున రాస్తారోకో, ధర్నాలు నిర్వహించారు. రెండుసార్లు ఆర్డీవో స్థాయి అధికారి సాగునీటి విడుదల కోసం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికి నీళ్లు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జడ్పీచైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు పలు గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటల మాదిరిగానే సాగునీరు అందక నష్టపోయిన రైతాంగానికి సైతం ఎకరానికి రూ. 20 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలన్నారు. పరిస్థితి ఎలానే ఉంటే వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఎస్సారెస్పీ, ఐబీ అధికారులు స్పందించి కాలువనీటిని విడుదల చేసి చివరి దశలో ఉన్న వరి పంటలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.



మంథని మండలంలో సాగునీరు అందక ఎండిన వరి పొలం

● ఓదెల మండలంలో 14,400వేల ఎకరాలకు ముప్పు..

ఓదెల మండలంలోని ఎస్సారెస్పీ, మానేరువాగు పరివాహక ప్రాంతాల్లో మొత్తం 17,200 వేల ఎకరాల్లో వరి పంటలు సాగు అయినట్లు ఇరిగేషన్ అధికారులు చెపుతున్నారు. ఇందులో ముందస్తుగా వేసిన వరి పంటలు పూర్తి అయ్యే దశలో ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువ ఆధారంగా వేసిన పంటలకు ఇప్పటివరకు నీరు అందింది. కానీ డి-86 ఎస్సారెస్పీ కాలువ నీటి విడుదలను అధికారులు పూర్తిగా నిలిపివేయడంతో 14,400 వేల ఎకరాల ఆయకట్టు పంటలకు సాగు నీరందక ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే మండలంలోని గుండ్లపల్లి, కనగర్తి మడక, జీలకుంట, కొమిర, పొత్కపల్లి శివారు తోపాటు, రూప నారాయణపేట, గూడెం, గుంపుల, ఇందుర్తి శివారులోని పంటలు గొలుసు దశలో ఉండగా, వీటికి నీరులేక పూర్తిగా ఎండిపోతున్నాయి. మరోకొద్ది రోజుల్లో ఎండలు తీవ్రతరం అయితే ఇక వ్యవసాయ, మంచినీటి బావుల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితి నెలకొంది.

● ఓదెల మండలంలో..

ఓదెల: కడుపునిండ నీటిని దాచుకొని తల్లిలా ఆదుకున్న మానేరువాగు ఇప్పుడు కన్నీటి జాడలను చూపిస్తోంది. భూగర్భ జలాలకు ఆలవాలమైన వాగులో ఇసుక తవ్వకాలతో వాకిళ్లుగా మారిపోయాయి. మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలైన 10 గ్రామాల్లో వాగు నీటి ఆధారంతో సాగుచేసిన దాదాపు ఆరువందల ఎకరాల వరి పంటలకు నీరు లేక బీటలు వారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్జీటీ నిబంధనలను తుంగలోతొక్కి మానేరు ఇసుకను పట్టణాలకు తరలించడంతో ఇప్పుడు ఇసుక క్వారీలు ఉన్న గ్రామాల్లో సాగునీటికి, తాగునీటికి ప్రజలంత తల్లడిల్లుతున్నారు. భూగర్భ జలాల అభివృద్ధి పేరుతో మానేరు వాగుపై అడ్డుకట్టలు వేసి చెక్ డ్యాంలను నిర్మించారు. అనంతరం నీటి వరదలకు చెక్ డ్యాములు కూలిపోయి సాగుకు ఉపయోగపడాల్సిన వాగు నీరంతా దిగువ ప్రాంతానికి వృధాగా పోయాయి. మానేరు పరివాహక గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలకు సాగునీటి కోసం మానేరులో బోర్లు వేసిన కూడా నీటి జాడలు లేక అవి కూడా ఎత్తిపోయాయి. ఇక ఏమి చేసేది లేక రైతులు వాగులోని బోర్లకు అమర్చిన పైపులను సైతం తీసుకెళుతున్నారు. ఇసుక తవ్వకాలు గత డిసెంబరు వరకు పూర్తికాగా, మళ్లీ ఇసుక తవ్వకాలకు ప్రస్తుత ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఏడాది పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలను చేపట్టి, వాగులో ఇసుక లేకుండా చేయడంతో వాగు ఆధారంతో సాగుచేసిన పంటలకు ఇప్పుడు నీరులేక కరువు ఛాయలు తాండవిస్తున్నాయి. చేతికి అందిస్తున్న పంటలు కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



నెర్రెలుబారిన పంట పొలం

సాగునీరు ఇచ్చి పంటలను కాపాడండి

- కొండపాక నీలకంఠ చారి, రైతు, మడక



అప్పులు తెచ్చి నాలుగు ఎకరాల్లో మక్క, వరి పంటలు సాగుచేశాను. మానేరు వాగు పూర్తిగా ఎండిపోవడంతో పంటలకు సరిపడా నీరందడంలేదు. గొలుసు దశలో ఉన్న పొలాలు ఇప్పుడు చేతి కంద కుండా పోతున్నాయి. పంటలు ఎండిపోతే ప్రభుత్వం స్పందించి, ప్రకృతి వైపరీత్యం కింద ఎకరానికి రూ. 80 వేలు చెల్లించాలి.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 24: కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు జగన్నాథ ఆచార్యులు, మధుసూదనాచార్యులు, భానుప్రసాదాచర్యుల బృందం శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవ పూజలు జరిగాయి. మహాపూర్ణహూతి హోమం, పుష్కరిణిలో చక్రస్నానం, అవమృతం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ-మాలతీ దంపతులు పాల్గొని పూజలు చేశారు. యజమానులకు వేద ఆశీర్వచనం, తీర్థప్రసాద గోష్టి, అన్నప్రసాద వితరణ చేశారు. కాలనీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహనీయుల జయంత్యుత్సవ కమిటీ

పెద్దపల్లిటౌన్, మార్చి 24: జగ్జీవన్‌రామ్ జయంతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాల నిర్వహణకు కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట్ల విజయరమణారావును ఎన్నుకున్నామని ఉత్సవ కమిటీ కన్వీనర్, మహనీయుల ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు బొంకూరి కైలాసం, దళిత సంఘ నాయకులు మాటూరి దుర్గయ్య తెలిపారు. కార్యక్రమంలో బొంకూరి కైలాసం, ఉస్తెం శ్రీనివాస్ ముదిరాజ్, కోదాటి రాజ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓదెలకు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు

ఓదెల, మార్చి 24: మండల కేంద్రంలో ఎట్టకేలకు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు అయింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్వోసి నంబర్. 13 ఈ1/2023 ఉత్తర్వులు జారీ చేసింది. మండల కేంద్రంలో కోర్టు ఏర్పాటు కోసం హైకోర్టు న్యాయవాది పొలాస శంకర్ ఆధ్వర్యంలో కొన్నాళ్లుగా రాష్ట్ర ప్రభుత్వానికి, న్యాయశాఖ మంత్రి, హైకోర్టు న్యాయమూర్తికి, రిజిస్టర్ జనరల్ న్యాయశాఖ కార్యదర్శికి అనేక పర్యాయాలుగా ప్రజల ఇబ్బందులు కక్షిదారుల, న్యాయవాదుల ఇబ్బందులను దృష్టికి తీసుకెళ్లి, కోర్టు ఏర్పాటు ప్రాముఖ్యాన్ని తెలిపారు. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఓదెలలో కోర్టు ఏర్పాటుకు జీవో జారి చేసిందని పొలాస శంకర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేవెళ్ల, జన్నారం, ఓదెల, తూప్రాన్, జనగామ, హనుమకొండ, సిద్దిపేట్‌లలో కోర్టులను మంజూరు చేయగా ఇందులో ఓదెల కేంద్రం ఒకటి. ఈ కేంద్రాల్లో కోర్టుల ఏర్పాటుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

జిల్లాలో కొన్నాళ్లుగా సుల్తానాబాద్ కోర్టులో ఉన్న కేసుల విచారణలో పనిభారం అధికమై ఒత్తిడి పెరుగుతోంది. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాలకు చెందిన దాదాపు 1,500 కేసులు విచారణలో ఉన్నాయి. ఓదెలలో కోర్టు ఏర్పాటుతో కేసులన్నీ పరిష్కారం కావడమే కాకుండా, జడ్జీలకు, న్యాయవాదులకు, కక్షిదారులకు పని భారం, దూరభారం తగ్గి త్వరగా పరిష్కారానికి మార్గం సుగమనమయ్యే అవకాశం ఉంది. కోర్టు మంజూరుపై న్యాయవాదులు సర్వోత్తమ్‌రెడ్డి, శంకర్ ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు కృతజ్ఞత తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

భూ సంస్కరణలను నీరుగార్చిన పాలకులు

- స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి - రైతు సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న రియాజ్‌అహ్మద్

కోల్‌సిటీటౌన్, మార్చి 24: భూసంస్కరణల్లో ట్రస్టులు, దేవాలయాలు, తోటలు తదితర విభాగాలకు మినాహాయింపులు ఇచ్చి భూసంస్కరణలను పాలకులు నీరుగార్చారని పలు వక్తలు ఆరోపించారు. ఆదివారం గోదావరిఖనిలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘాల నాయకులు వర్ద వెంకటరెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, హెచ్‌ఎంఎస్ నాయకులు రియాజ్‌అహ్మద్, ముడిమాడుగుల మల్లన్న మాట్లాడారు. స్వామినాథన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ పంట వేయాలి అనే విషయంలో రైతుకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, పెట్టుబడిదారులకు అవసరమైన పంటలను పండించాల్సిన దుస్థితి రైతుకు ఏర్పడిందన్నారు. రైతులకు మార్కెట్లో కూడా అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో వ్యవసాయ రంగ భూమిని వ్యాపారాలకు ధారాదత్తం చేసేలా పాలకులు చేస్తున్నారన్నారు. హైదరాబాద్ రాష్ట్రంలో నాడు లక్షకు పైగా చెరువులు ఉండేవన్నారు. నిజాం సాగర్‌లాంటి ప్రాజెక్టులు కూడా నాటి పాలకులు ఆనాడు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పుడు అవి 34 వేల చెరువులకు దిగజార్చారని రైతులకు చేయూత ఇవ్వాల్సిన పాలకులు వారిని అణిచివేతకు గురిచేశారన్నారు. సింగరేణి సంస్థకు భూమి ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, పని పూర్తి అయిపోయిన తరువాత తిరిగి సాగు యోగ్యాన్ని రైతులకు అందించాలని, అసైన్డ్ భూములు బడుగుబలహీన దళిత వర్గ రైతులకు పంచాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని తదితర తీర్మాణాలు చేశారు. ఏలేశ్వరం వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కొడిపుంజుల రాజన్న, ఎరుకుల రాజన్న, సుదర్శన్, దుర్గం నర్సయ్య, నేదునూరి నరేష్, గుమ్మడి వెంకన్న, దుర్గం నగేష్ పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు.. మరమ్మతుల జాడే లేదు

● పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న పత్తిపాక రోడ్డు

ధర్మారం, మార్చి 24: మండలం పత్తిపాక, కమ్మరీఖాన్‌పేట రోడ్లు గుంతలుగా మారాయి. రోడ్లు చెడిపోయి ప్రమాదకరంగా ఉన్న మరమ్మతులు చేయడం లేదు. పత్తిపాక ఎక్స్ రోడ్డు నుంచి పత్తిపాక, నర్సింగాపూర్, ల్యాగలమర్రి గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలుగా మారింది. పత్తిపాక సమీపంలో రోడ్డు గుంతలుగా చెడిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై తారులేచి గుంతలుగుంతులుగా ఉండడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా కమ్మరీఖాన్‌పేట ఎక్స్ రోడ్డు నుంచి కమ్మరీఖాన్‌పేట, అబ్బాపూర్, జూలపల్లి మీదుగా వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి, తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కమ్మరీఖాన్‌పేట శివారులో లోలెవల్ వంతెన కూడా చెడిపోవడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ దారి గుండా రైతులు పండించిన పంట ధాన్యాన్ని ఇంటికి తీసుకురావడానికి సైతం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లను మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెడిపోయి గుంతలుగా మారిన రోడ్లను మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

గోదావరిఖనిలో మూసివేసిన థియేటర్ కూల్చివేత

● రూ.30కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంపై వివాదం ● ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్పొరేషన్‌కు స్థానికుల ఫిర్యాదు ● కూల్చివేతపై నగరంలో చర్చ

కోల్‌సిటీ, మార్చి 24: గోదావరిఖని నడిబొడ్డున గల మూసివేసిన ఓల్డ్ అశోక థియేటర్‌ను శనివారం అర్ధరాత్రి రామగుండం నగరపాలక సంస్థ కూల్చివేసింది. ప్రభుత్వ స్థలంలో సింగరేణి నుంచి లీజు ప్రాతిపదికన పొంది నిర్మించిన ఈ థియేటర్ సుమారు 25ఏళ్ల క్రితమే మూతపడింది. సుమారు రూ.30కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి అప్పగించే విషయంలో సింగరేణి యాజమాన్యానికి, లీజుదారులకు మధ్య కొన్నేళ్లుగా వివాదం సాగుతోంది. ఈ పరిస్థితుల్లో శనివారం రాత్రి నిర్మాణాలను కూల్చివేశారు. శిథిలాలను సైతం తొలగించారు.

రామగుండంలో సింగరేణి అవసరాల కోసం ప్రభుత్వం జనగామ శివారు సర్వే నంబర్683లో స్థలాన్ని సింగరేణికి అప్పగించింది. సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లో బొగ్గు తవ్వకాలు జరిపి కార్మిక వాడలు వెలిశాయి. ఈ పరిస్థితుల్లో సినిమా థియేటర్ నిర్మాణానికి స్థలం లీజుకు ఇవ్వాల్సిందిగా అశోక టాకీస్ యాజమాన్యం సింగరేణిని సంప్రదించడంతో ఎస్ రాజయ్య, అశోక థియేటర్ భాగస్వామిపై లీజుకు ఇచ్చింది. తరువాత 1975లో ఆర్థిక అవసరాల నిమిత్తం సికింద్రాబాద్‌కు చెందిన మరో వ్యక్తికి ఐదేళ్ల కాలపరిమితితో సబ్ లీజ్ ఇచ్చేందుకు 1975 జూన్‌లో సింగరేణి అనుమతి ఇచ్చింది. లీజుదారుడు మరణించడంతో ఆర్థిక వివాదాలతో థియేటర్ మూతపడింది. దీన్ని ఖాళీ చేయాల్సిందిగా సింగరేణి యాజమాన్యం జీపీ హోల్డర్లుగా ఉన్న వారికి నోటీసులు ఇచ్చింది. జిల్లా కోర్టులో సైతం సింగరేణికి అనుకూలంగా తీర్పు వచ్చింది. తాము కంపెనీ అవసరాల కోసం ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్న స్థలంలో లీజు పొడగించలేమని, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించలేమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రభుత్వ అవసరాల కోసం తమకు స్థలాలు అప్పగించాలంటూ ఒత్తిడి ఉందని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని రెగ్యులరైజ్ చేయాల్సిందిగా లీజు దారుగా పేర్కొన్న వ్యక్తి 2008మార్చిలో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా దాన్ని సైతం తిరస్కరించారు. జీపీ హోల్డర్‌గా పేర్కొంటున్న వేముల అశోక్ హైకోర్టును ఆశ్రయించారు. తన వ్యాపార విస్తరణ కోసం తమకు లీజు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు. అశోక్ అభ్యర్థనను పరిశీలించాల్సిందిగా కోర్టు సూచించింది. దీనికి సింగరేణి నుంచి సానుకూలత రాలేదు. మరో నగరంలో రూ.30కోట్ల విలువైన 34గుంటల ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిందిగా ప్రభుత్వం సింగరేణికి పలుమార్లు లేఖలు రాసింది. నిబంధనల ప్రకారం సింగరేణి యాజమాన్యం ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే అధికారం లేదు. 2008లో ఈ స్థలం గుండా రోడ్డు తీసేందుకు అప్పటి మున్సిపల్ అధికారులు నోటీసులు సైతం ఇచ్చారు. మూత పడిన థియేటర్ చుట్టూ లీజుస్థలంలో వ్యాపార సంస్థలు కూడా వెలిశాయి. మూతపడిన థియేటర్ ప్రాంగణం పూర్తిగా చెత్తమయమై చెట్లు పెరగడంతో తమకు ఇబ్బందికరంగా మారిందని, చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు నగరపాలక సంస్థకు ఫిర్యాదులు చేశారు.



ఓల్డ్ అశోక థియేటర్‌ను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేస్తున్న సిబ్బంది



ఓల్డ్ అశోక థియేటర్ తొలగించడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం

● చర్చనీయాంశమైన ఓల్డ్ అశోక తొలగింపు

సింగరేణికి చెందిన కోట్లది రూపాయల విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతున్న సమయంలో ఓల్డ్ అశోక థియేటర్ తొలగింపు నగరంలో చర్చనీయాంశం అయ్యింది. లక్ష్మీనగర్‌లో ఇరుకు రోడ్లు ఉన్నాయని, కనీసం 30అడుగులు కూడా లేని పరిస్థితుల్లో అడ్డుగా ఉన్న కట్టడాలను మాత్రమే తొలగించామని నగరపాలక సంస్థ పేర్కొంటుంది.

● థియేటర్ కూల్చివేశారంటూ ఫిర్యాదు

తన స్వాధీనంలో థియేటర్‌ను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కమిషనర్ బలవంతంగా కూల్చివేశారని, అందులోని ప్రొజెక్టర్లు, కుర్చీలు ఎత్తుకెళ్లినట్టు వేముల అశోక్ అనే వ్యక్తి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నామని, తదుపరి చర్యలు చేపడుతామని సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, మార్చి 24: వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి ఎలుబాక కార్తీక్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన ఎలుబాక శ్రీనివాస్ అనే వ్యక్తికి ఇద్దరు కుమారులు శివప్రసాద్, కార్తీక్ ఉన్నారు. వీరు కరీంనగర్‌లోని వెల్డింగ్ షాపులో పని చేస్తున్నారు. రెండో కుమారుడు కార్తీక్ వారి బంధువుల అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పెద్దకుమారుడు పెళ్లి అయిన తర్వాత చేస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ అమ్మాయికి తల్లిదండ్రులు వేరే పెళ్లి నిశ్చయించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కార్తీక్ ఈ నెల 22న(శుక్రవారం) మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి గ్రామంలోని మామిడితోటలో రాత్రి వేళ పురుగుల మందు తాగాడు. అనంతరం తన అన్నకు ఫోను ద్వారా తెలిపాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన అన్న 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు తీవ్రగాయాలు

కోనరావుపేట, మార్చి 24: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామానికి చెంది కాసారాపు స్నేహిత్ బీటెక్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన సిరిమల్ల మహేష్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. వీరిద్దరు మర్తనపేట నుంచి ధర్మారానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగివస్తున్న సమయంలో ధర్మారం దర్గా వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయారు. తీవ్రగాయాలైన వీరిద్దరిని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తే బైక్ అదుపు తప్పి పడ్డారా. లేదా ఏదైనా వాహనం తగిలిపడ్డారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

కన్నుల పండువగా నృసింహుడి తెప్పోత్సవం


బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో యోగ నారసింహుడి డోలోత్సవం

ధర్మపురి, మార్చి 24: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ) తెప్ప, డోలోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య మధ్యాహ్నం వేళలో ఉత్సవమూర్తులను సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం ఆలయం నుంచి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వరకు తీసుకువచ్చారు. స్వామి వారల సేవలను హంస రూపంలో గల నూతన వాహనం పైన ఉంచి బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణాలు చేయించగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అటు తరువాత స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సాంప్రదాయ రీతిలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో స్వామి వారల డోలోత్సవం జరిపారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా లోనికి ప్రవేశించి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించగా శోభిల్లింది. రాత్రి 10 గంటలవరకు ఉత్సవం కొనసాగింది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పలువురు ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉత్తర ద్వారం గుండా లోనికి ప్రవేశించి, స్వామి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు.

● పోటెత్తిన భక్త జనం

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 20 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో భక్తి పారవశ్యం ఉప్పొంగింది. భారీగా తరలి వచ్చి భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు స్వామి వారల చెంతకు చేరారు. భక్తుల నరసింహ నామస్మరణలు..మహిళల పూనకాలు, విధి విధాన పూజలతో ఆలయాలు కిట కిటలాడాయి. ఉగ్ర నారసింహుని ఆలయం వద్ద వల్లుబండ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారలకు ప్రీతి అయిన పట్టె నామాలు, కోరె మీసాలు సమర్పించారు. నృసింహుడికి మహిళలు కుంకుమ పూజలు జరిపారు. ఆలయం పక్షాన సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది తగు సేవలు అందించారు. ఆర్యవైశ్య, నిత్యాన్న సత్రం సంఘం కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రైస్‌మిల్ యజమానులు ఇనుగంటి వేంకటేశ్వర్ రావు, గునిశెట్టి రవీందర్, శ్రీనివాస్, మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, సేవలు అందించారు. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో 150 కిలోల పెరుగు, 5,000 మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్ ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వరం గ్రామానికి చెందిన వేల్పూరి శ్రీయాన్ అనే రెండేళ్ల బాలుడు తప్పిపోగా పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించాడు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పలు వురు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

- డోలోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

● నిత్య పూజలు..హోమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నేరెళ్ల విజయ్ స్థాపిత దేవతా, విశ్వక్సేన, గరుడ, నరసింహ హోమాలు, నిత్య హవనం, బలిహరణములు, సుదర్శన హోమాలు ప్రత్యేకంగా జరిపారు.

● రూ. 5,76,704 ఆదాయం

బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలగో రోజు ఆలయానికి రూ. 5,76,704 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 2,05,313, ప్రసాదాలు విక్రయించగా రూ 2,94,000 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ 77,391 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఈవో తెలిపారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సల్లో భాగంగా ఈ నెల 25న సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి లో శ్రీ కొత్త లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శేషప్ప కళా వేదికపై ఉదయం శ్రీ సద్గురు త్యాగరాజ సంగీత ఆరాధనోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఉదయం 9 గంటల నుంచి 10 వరకు నగర సంకీర్తన, పూజా కార్యక్రమాలు, కొరిడే రమాదేవిచే త్యాగరాజ జీవిత చరిత్ర ప్రసంగం ఉంటుంది. 11 నుంచి పంచరత్న గానాలు, రాత్రి వేళలో పంచరత్న గానాలు ఉంటాయి. స్థానిక కళాకారులు సంగనభట్ల నరేందర్, సుభాషిణి, కరీంనగర్‌కు చెందిన డాక్టర్ తిరుమలచే భక్తి సంగీత విభావరి, తత్వమసి చంద్రకాంత్ బృందంచే కథక్ నృత్య ప్రదర్శన ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.


ధర్మపురి క్షేత్రంలో పోటెత్తిన భక్త జనం


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అంతర్గాం, మార్చి 24: రామగుండం-పెద్దపేట రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైన్ పట్టాలపై ఆదివారం గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(38) మృతి చెందినట్టు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి జీ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నలుపురంగు ప్యాంటు, ఎరుపు రంగు టీ షర్టు ధరించాడని, ఇతర వివరాలు ఏమి తెలియరాలేదని తెలిపారు. ముఖంపై, తలపై తీవ్రగాయాలు ఉండడంతో రైలు ఢీకొని, లేక రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ఆసుపత్రిలో భద్రపరిచినట్టు, సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు తిరుపతి తెలిపారు.

బాలుడు కిడ్నాప్‌నకు యత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు

మానకొండూర్, మార్చి 24: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన బొల్లబత్తుల కార్తికేయ (11) అనే బాలుడిని ఈ నెల 22న కిడ్నాప్‌కు యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన రమేశ్ అనే వ్యక్తి చిన్న కుమారుడు కార్తికేయ గ్రామంలో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ సమయంలో బైక్ పై ఇద్దరు వ్యక్తులు వచ్చి చాక్లెట్ ఇస్తానని చెప్పి కిడ్నాప్‌నకు యత్నించారు. బాలుడు భయంతో పరిగెత్తి ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం బాలుడి తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కోరుట్లలో చిన్నారుల కిడ్నాప్ కలకలం

- ఫైనాన్స్ రికవరీకి వచ్చిన వ్యక్తులుగా గుర్తించిన పోలీసులు


కాలనీలో గుమిగూడిన స్థానికులు

కోరుట్ల, మార్చి 24 : పట్టణంలోని సాయిరాం పుర కాలనీలో వేకవజామున చిన్నారుల కిడ్నాప్ ఉదంతం కలకం రేపింది. కాలనీలో వేకవజామున ఇంటి బయట ఆటలు ఆడుకుంటున్న చిన్నారులను ద్విచక్ర వాహనపై ఎక్కించుకుని పాఠశాల అడ్రస్ చూపాలని సదరు వ్యక్తులు కోరగా అడ్రస్ చూపడానికి చిన్నారులు ద్విచక్ర వాహనం ఎక్కారు. పక్కనే ఉన్న వారు పిల్లలను ఎక్కడకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించడంతో సదరు వ్యక్తులు పిల్లలను దించి వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్ తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ద్విచక్ర వాహనంపై ఎక్కిన బొమ్మెన విశ్వేష్ (8), బొమ్మెన విఙ్ఞేష్ (9)లను జరిగిన విషయంపై పోలీసులు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకుంటున్న సిద్దు అనే వ్యక్తి గురించి ఇద్దరు వ్యక్తులు నంబర్‌లేని ద్విచక్ర వాహనంపై వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సదరు ఇంటి యజమాని వారు ఎందుకు వచ్చినట్లు ఆరా తీయగా ఇంటిలో కిరాయికి ఉంటున్న వ్యక్తి బ్యాంకులో రుణం తీసుకుని బాకీ ఉన్నట్లు వచ్చిన వ్యక్తులు వివరించినట్లు తెలిసింది. ప్రైవేట్ బ్యాంకులో రికవరీ చేసే బ్యాంక్ సిబ్బందిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కాలనీకి వచ్చిన వ్యక్తులు వేకవజామున నంబర్ లేని వాహనంతో పాటు నైట్ ప్యాంట్ ధరించి రావడంతో కాలనీ వాసులు అనుమానించారని ఎస్ఐ తెలిపారు. విషయం పూర్తిగా తెలియకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో కాలనీ వాసులు అసహనం ప్రదర్శించారు.

ద్విచక్ర వాహనం దహనం

తంగళ్లపల్లి, మార్చి 24: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంతో తనకు నష్టం వాటిల్లుతోందని కోపోద్రిక్తుడైన ఓ యువకుడు బైక్‌ను దహనం చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన హరి ద్విచక్ర వాహనంపై వేములవాడకు బయలుదేరాడు. ఈ క్రమంలో సిద్దిపేట శివారులో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదే వాహనంపై వేములవాడకు వెళ్తున్న క్రమంలో సహనం కోల్పోయి నేరెళ్ల శివారుకు చేరుకోగానే రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలిపి తగులబెట్టాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

-ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్


మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి 24: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని శాతవాహన ఉప కులపతి ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ సెమినార్స్ ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇలాంటి రీసెర్చ్ మెథడాలజీ కోర్సులు రీసెర్చ్ స్కాలర్లకి చాలా ఉపయోగపడతాయన్నారు. ఆచార్య చన్న బసవయ్య మాట్లాడుతూ సమాజంలో ఉన్న సమస్యలకు రీసెర్చ్ ద్వారా సమాధా నాలు వెతికే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ డైరెక్టర్ డా.ఎస్‌వి.శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కోర్సు నిర్వహించ డానికి తనను ప్రోత్సహించిన శాతవాహన అధికారు లను, కోర్సులో చేరి విజయవంతం చేసినటువంటి రీసర్చ్‌స్కాలర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో కోర్సు కో డైరెక్టర్ డాక్టర్ ఈ మనోహర్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం.మనోజ్‌కుమార్, కృష్ణకుమార్, డాక్టర్ కే తిరుపతి, అజీజ్, విజయ్ సావిత్రి, ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు సన్మానం


మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

రామడుగు, మార్చి 24: రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఆదివారం ఘన సన్మానం చేశారు. మహిళా కమిషన్ ఛైర్ పర్సన్‌గా నియమితులై మొదటి సారిగా మండలంలోని తన స్వగ్రామమైన వెదిర గ్రామానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలోని వేంకటేశ్వర, మార్కండేయ, రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోల రమేశ్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుడ్ల భవాని, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- పుట్టినరోజు వేడుకలు వచ్చి అనంతలోకాలకు

మల్లాపూర్, మార్చి, 24 : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలోని మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన సాయమల్ల శివకుమార్ (20)అనే యువకుడు బావిలో మునిగి శనివారం మృతి చెందాడు. ఆదివారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా మాక్లూరు మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన శివకుమార్ మండలం లోని చిట్టాపూర్ గ్రామంలోని తన మిత్రుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన డానికి వచ్చాడు. మిత్రులతో కలసి గ్రామ శివారులోని చెరువు సమీపంలోని బావి వద్దకు వెళ్లారు. బావిలోకి ఒకరు తరువాత ఒకరు దుకారు. శివకుమా ర్‌కు ఈత రాకపోవడంతో బావిలో మునిగిపోయాడు. తోటి మిత్రులు ఎంత వెతికిన శివకుమార్ కనిపించకపోవడంతో గ్రామస్థులకు, పోలీసులకు సమచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన ఎస్సై కిరణ్‌కుమార్ గజ ఈతగాళ్లతో మృత దేహాన్ని వెలికి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అదిం చారు. మృతుడు సాయమల్ల శివకుమార్ తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతి లేని పేలుడు పదార్థాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న పేలుడు పదార్థాలు

చందుర్తి, మార్చి 24: అనుమతులు లేకుండా నిలువ చేసిన జిలిటెన్ స్టిక్స్, కాంప్రెసర్ ట్రాక్టర్‌ను చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామ శివారులో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. రామారావు పల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో విచ్చలవిడిగా జిలిటెన్ స్టిక్స్ ట్రాక్టర్ సంచరిస్తున్నట్లు సమాచారం మేరకు డ్రిస్కిక్ బాంబ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టి 24 డిటోనేటర్స్, 16 స్లారీ కంకులు, రెండు బైండింగ్ వైర్ల కట్టలు, ఒక డైనమా, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు, రామారావు పల్లెలో గ్రామానికి చెందిన కొమిరె మల్లయ్య తన కాంప్రెసర్ ట్రాక్టర్‌ను గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పూడిక తీసేందుకు సిద్ధం కాగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంగరంగ వైభవంగా నర్సింహస్వామి రథోత్సవం


కిషన్‌రావుపేట రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెల్గటూర్, మార్చి 24: మండలం లోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మి నర్సింహస్వామి రథోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని అందంగా అలంకరించిన పీఠంపై రథంలో నిలిపి రథోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రాభోధిక, విష్వక్సేన విధి, చతుఃస్థానార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం రథబలి, పుష్పయాగం, ఏకాంతసేవ, గ్రామబలి, రథోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారిని రోజుకో రీతిన పూజలు నిర్వహించి, చివరి రోజు రథోత్సవం జరిపారు. స్వామి వారి రథోత్సవం ముందు మహిళలు కోలాటం ఆకట్టుకుంది. భక్తులు రథోత్సవంతో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిపై బుకా గులాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరిలి రావడంతో ఆలయాల ప్రాంతం కిక్కిరిసి పోయింది. స్వామి వారికి కొబ్బరి కాయలు కొట్టి చల్లంగా చూడమని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఓదెలలో మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

ఓదెల, మార్చి 24: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రానికి ఆదివారం మొక్కులను సమర్పించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అదిలాబాద్, మంచిర్యాల, చిట్యాల, మండలాల నుంచి అధికంగా తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి స్వామివారికి సమర్పించారు. అలాగే మల్లికార్జునస్వామికి బోనాలతో మొక్కులను సమర్పించిన అనంతరం, ఆలయంలో కోడేలతో ప్రదక్షిణ చేసి మొక్కులను సమర్పించారు. అనంతరం ఆలయంలో అర్చనలు నిర్వహించా రు. మరో 15 రోజుల్లో వచ్చే ఉగాది పర్వదినానికి ముందు భక్తులంతా భ్రమరాంబ మల్లికార్జున స్వామిని, మదన పోచమ్మ, బంగారు పోచమ్మలకు మొక్కులను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.


కోడే మొక్కు, చెల్లించుకుంటున్న భక్తులు


ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఘనంగా స్వామివారల డోలోత్సవం

వేములవాడ, మార్చి 24: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారల డోలోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం రాత్రి శ్రీస్వామివారి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఊయలలో శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామి, శ్రీలక్ష్మిఅనంతపద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను ఉంచి డోలోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు శ్రీపార్వతీరాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఫంక్షన్‌హాళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, మార్చి 24: ఫంక్షన్‌హాళ్లలో చోరీలకు పాల్పడిన నిందితులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ ఖాన్‌పురాకు చెందిన మహమ్మద్ రహీం బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలోని ఓ జిమ్ సెంటర్ ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. ఆ సెంటర్‌కు ఈత నేర్చుకునేందుకు వెళ్లిన 12 ఏళ్ల బాలుడితో పరిచయం ఏర్పడగా ఇద్దరూ సులువుగా సంపాదించాలని ఉద్దేశంతో ఫంక్షన్‌హాల్స్‌లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఫంక్షన్స్ జరిగే ఫంక్షన్ హాళ్ల సమాచారాన్ని రహీం తన స్నేహితుడైన ఆటో డ్రైవర్ మైసన్ బిన్ హదితో తెలుసుకునేవాడు. ఆ ఫంక్షన్‌హాల్స్‌కు రహీం, బాలుడిని తన బైక్‌పై తీసుకువెళ్లేవాడు. రహీం బైక్‌పై బయటే ఉండగా, బాలుడు ఫంక్షన్‌హాల్స్ లోపలికి వెళ్లి శుభకార్యాలకు వచ్చిన అతిథుల హ్యాండ్ బ్యాగ్స్ నుంచి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుని బైక్‌పై పారిపోయేవారు. కరీంనగర్, బొమ్మకల్, అలుగునూర్, హుజురాబాద్‌లోని పలు ఫంక్షన్ హాళ్లలో దొంగతనాలకు పాల్పడి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, డబ్బులు చోరీ చేశారు. ఆభరణాల్లో కొన్నింటిని విక్రయించేందుకు శనివారం వరంగల్‌కు బాలుడు, మైసన్ బిన్ హాదిలు కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎల్‌ఎండీ ఎస్ఐ బి.చేరాలు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు గ్రాముల బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, బైక్‌ను స్వాధీన చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని రిమాండ్ చేశారు. ముఖ్య నేరస్తుడైన మహమ్మద్ రహీమ్‌ను పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ సీఐ రవీందర్, ఎస్‌బీఐ సృజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు ఆధ్వర్యంలో 4 బృందాలను ఏర్పాటు చేశారు. దొంగిలించిన బంగారు సొత్తుతో పారిపోదామని మహమ్మద్ రహీం కరీంనగర్ బస్టాండ్‌కు వెళ్తుండగా ఆదివారం జడ్పీ కార్యాలయం ఎదుట పోలీసులు అరెస్టు చేశారు. 150 గ్రాముల బంగారు ఆభరణాలను, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు నింది తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎల్‌ఎండీ ఎస్సై బి చేరాలు, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, హెడ్ కానిస్టేబుల్ అంజ నే యులు, కానిస్టేబుల్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని సీపీ అభినందించారు.


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై చేరాలు

ప్రారంభానికి నోచుకోని నీరుకుల్ల మానేరు వంతెన

- శంకుస్థాపన చేసి ఎనిమిదేళ్లు
- నిర్మాణం పూర్తయి ఆరేళ్లు
- ఇప్పటికీ వినియోగంలోకి రాని వైనం

సుల్తానాబాద్, మార్చి 24: అది ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి కల.. ఎనిమిదేళ్ల క్రితం కార్యరూపం దాల్చింది. నాటి ఉమ్మడి కరీంనగర్-వరంగల్ జిల్లాల ప్రయాణికుల ఆశలు చిగురించే సమయం ఆసన్నమైందని సంతోషపడ్డారు. తమ ప్రయాణానికి దూరభారం తగ్గుతుందని ఆశించారు. కానీ వారి ఆశలు అడియాశలే అయ్యాయి. వంతెన నిర్మాణం అయింది కానీ అది బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాల రాకపోకలకు యోగ్యంగా ఉన్నా మరింత ముందుకు పోని సందర్భం ఏర్పడింది. అధికారులు అనాలోచిత చర్యల ఫలితమే ఎనిమిదేళ్ల నుంచి వంతెన వినియోగంలోకి రాలేకపోతోంది. వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం, వంతెన నుంచి కుడి వైపు వెళ్లినా, ఎడమ వైపు వెళ్లినా మధ్యలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు వాహనాల రాకపోకలకు అడ్డంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంత గ్రామాల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేరు వాగుపై వంతన నిర్మాణ ఆవశ్యకతను, ప్రయాణ వెసులుబాటును, తగ్గే ధూర భావం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని 2016లో నాటి ప్రభుత్వం రూ 47 కోట్లు నిదులు మంజూరు చేసింది. అయితే ఈ వంతెన నిర్మాణం గురించి గత ముప్పై ఏళ్ల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వాల వద్ద ఉన్నాయి. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి పెద్దపల్లి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి వంతెన నిర్మాణం అవశ్యకతను వివరిస్తూ అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ ప్రతిపాదనలను ప్రభుత్వం వద్ద ఉంచారు. ఆనాటి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి జీవన్‌రెడ్డి వంతెన నిర్మాణం కోసం నిధులు 47 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. కానీ పనులు జరగక నిదులు వెనక్కిపోయాయి. తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో జిల్లా ప్రణాళికా మండలి సమావేశం లో పాల్గొన్న సందర్భంలో ఆనాటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వంతెన నిర్మాణం నిధులు గురించి వినతిపత్రాన్ని కేసీఆర్‌కు సమర్పించగా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

● **2016లో శంకుస్థాపన..**

2016లో అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, హరీ‌ష్‌రావు తదితరులతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో నీరుకుల్ల వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోనే



నీరుకుల్ల మానేరు వాగుపై నిర్మించిన వంతెన

పనులు పూర్తి చేయించారు. వంతన నిర్మాణం పూర్తి చేయడంపైనే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించారు. కానీ వంతెన పూర్తయ్యాక రాకపోకల సంగతిని ఆలోచించలేదు.

నీరుకుల్లపై వంతెన నిర్మాణం పూర్తి కావడం ద్వారా ఆటు ఉమ్మడి వరంగల్ ఇటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. సుల్తానాబాద్ మండలం నీరకుల్ల అటు మానకొండూరు మండలం వేగురుపల్లి ప్రాంతాల నుంచి ఎంతో మంది నిత్యం సుల్తానాబాద్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో చాలామంది సింగరేణి ఉద్యోగులు ఉండడం విశేషం. దాంతోపాటు పారిశ్రామిక ప్రాంతాలనైన మంచిర్యాల, రామగుండం, గోదావరిఖని, మందమర్రి బెల్లంపల్లి ప్రాంతాల వారికి ఈ వంతెన మీదుగా వెళ్లడం వలన 30 నుంచి 35 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు కూడా దూరభారం తగ్గుతుంది.

● **ముందుచూపు కరువు..**

నీరుకుల్ల వంతెన నిర్మాణం పూర్తయి రాకపోకలు సవ్యంగా సాగుతాయని అందరూ ఆశించారు. వంతెన నిర్మాణాన్ని స్థానిక రోడ్డుకు కలిపారు. కానీ వంతెన నుంచి ఎడమ వైపు వెళ్తే కోమాండ్లపల్లి రోడ్డులో ఒక రైల్వే వంతెన, కుడి వైపు నీరుకుల్ల గ్రామం వద్ద మరో రైల్వే వంతెన ఉంది. ఈ వంతెనల నుంచి బస్సులు లారీలు ఇతర భారీ వాహనాలు అసలే వెళ్లలేవు. దాంతో మానేరుపై నిర్మించిన వంతెన వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. ప్రస్తుతం కార్లు, చిన్నవాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ లోలెవల్ రైల్వే అండర్ బ్రిడ్జిల గురించి ముందుగానే



వంతెన పైకి వేళ్లే మట్టి రోడ్డు

పరిగణలోకి తీసుకుని దానికి తగ్గ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే ఇప్పటికే వంతెన ఉపయోగంలోకి వచ్చి ఉండేది.

● **కొలిక్కిరాని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..**

వంతెనను ఉపయోగంలోకి తేవాలంటే అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓ వైపు అప్రోచ్ రోడ్డు లేకపోవం, మరో వైపు రెండు వైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలు అడ్డుగా ఉన్నాయి. వంతెన నుంచి కుడి ఎడమ వైపు ఉన్న లోలెవల్ రైల్వే బ్రిడ్జిలున్నా మళ్లీ పెద్దవిగా నిర్మించాలి లేదా ప్రస్తుత వంతెన నుంచి రైలు మార్గంపై నుంచి నీరుకుల్ల- గర్రెపల్లి రోడ్డు పై వరకు ఫ్లైఓవర్ అయినా నిర్మాణం చేపట్టాలి. ఫ్లైఓవర్ నిర్మించడానికి ప్రస్తుత వంతెనను ఇంకా ముందుకు కొనసాగించాల్సి ఉంటుంది. కానీ నిర్మాణం చేపట్టేందుకు హైటెన్షన్ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయి. ఇలా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి ఓ కొలిక్కి రావడం లేదు. వంతెన నుంచి రంగంపల్లి వరకు పెద్దమ్మ దేవాలయం వరకు ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 27 కోట్లతో అంచనాలు తయారు చేసింది. ప్రదానంగా భూ సేకరణ సమస్య అడ్డుగా ఉన్నట్లు తెలిసింది. తొలుత భూసేకరణ జరిగి కొందరికి నష్టపరిహారం కూడా ప్రభుత్వం ద్వారా వచ్చింది. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నీరుకుల్ల వంతెనను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు తగిన కృషి చేసి వంతెన ఉపయోగంలోకి తేవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు ఆశిస్తున్నారు.

వేములవాడ రాజన్నను దర్శించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే



ఎమ్మెల్యే విజయరమణారావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

పెద్దపల్లి టౌన్, మార్చి 24: వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరి స్వామి వారిని ఆదివారం పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావు కుటుంబ సమేతంగా దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామి వారిని వేడుకున్నామన్నారు.

'మట్టి అక్రమ రవాణాను అరికట్టండి'

పెద్దపల్లిటౌన్, మార్చి 24: మట్టి అక్రమ రవాణాను సంబంధిత అధికారులు అరికట్టాలని పెద్దపల్లి పట్టణం శాంతినగర్‌కు చెందిన సానికొమ్ము రాంరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోయారు. పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు తదితర మండలాల్లో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తరలిస్తూ అక్రమార్కులు కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తూ సొమ్ములు చేసుకుంటున్న అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆయన మండిపడ్డారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి కూలర్ వితరణ

సుల్తానాబాద్, మార్చి 24: సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన ఓ పేదింటి యువతి వివాహానికి దాతలు కూలర్‌ను అందజేశారు. సుల్తానాబాద్ పట్టణాకి చెందిన రిటైర్డు ప్రభుత్వ ప్రదానోపాద్యాయ దంపతులు అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు ఈ కూలర్‌ను ఆడబిడ్డ కుటుంబ సభ్యులకు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

బీజేపీ ఓబీసీ కమిటీ ఎన్నిక

ఓదెల, మార్చి 24: మండలంలోని కొలనూర్‌లో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు కారంగుల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. మోర్చా మండల అధ్యక్షుడిగా పేరవేణి సతీష్, ఓబీసీ మండల ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కారంగుల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తీర్థాల కుమార్, రామినేని రాజేంద్రప్రసాద్, దాత రాకేష్, క్యాతం సాయి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి ప్రశంసాపత్రం అందజేత



పత్రాలు అందజేస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

రామగిరి, మార్చి 24: రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కురుమాల్ల భూమయ్య మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకు రావడం పట్ల ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్టు అధికారి నూక రమేశ్ మృతుడి భార్య లక్ష్మి, కుమారుడు కురుమల్ల కుమార్, కోడలు సింధు, కూతురు స్వరూప-తిరుపతిలకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

కోల్‌సిటీటౌన్, మార్చి 24: అగ్రకులాలు, ఇతర కులాల చేత కులవివక్షత, దాడులకు గురైన ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన బాధితులకు ప్రభుత్వం ద్వారా చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని తక్షణమే ఇప్పించేలా చొరవ తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, కురుమపల్లి మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, పాల రాజేశం కోరారు.

ఈ మేరకు ఈనెల 23న పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నాగులేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఇతర కులాల వారు, ఎస్సీ, ఎస్టీలను అకారణంగా కొట్టి కులం పేరుతో దూషించిన సంఘటనలో ఇప్పటివరకు కొద్ది మందికి మాత్రమే ప్రభుత్వపరంగా రావాల్సిన నష్టపరిహారం ఒకటి రెండు విడతల్లో మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. వెంటనే పరిహారాన్ని చెల్లించాలని, బాధితులను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమలో ఆరెల్లి మల్లేష్, అరికిల్ల రామలక్ష్మి, కోటగిరి పాపయ్య, బొంకూరి నవీన్, ఆర్ల సందీప్, సీపెల్లి రవీందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కాకా' కుటుంబాన్ని విమర్శించే స్థాయి 'గోమాసే'కు లేదు

గోదావరిఖని, మార్చి 24: సుదీర్ఘ కాలంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తున్న కేంద్ర మాజీమంత్రి కాకా వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే స్థాయి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు లేదని కాంగ్రెస్ లీడర్ పీ మల్లికార్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీగా నాలుగుసార్లు గెలిచిన వెంకటస్వామి కేంద్ర మంత్రిగా, ఒక సారిఎంపీగా గెలిచిన వివేక్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో జాతీయ రహదారులు, బ్రిడ్జిల నిర్మాణంతో పాటు రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. మూసివేసిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని బీఐఎఫ్ఆర్ నుంచి బయటకు తీసుకువచ్చారన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా వస్తున్న కాకా వారసుడు వంశీకృష్ణను తిరిగి గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధన్వాడ గూడూరు నుంచి ప్రజలు తరిమికొడితే వెళ్లిన గోమాసే శ్రీనివాస్ నేడు రాజకీయ లబ్ధి కోసమే కాకా కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని, ఇది సరైంది కాదని ఆయన హితవు పలికారు. కరోనా సమయంలో ప్రజలకు సేవ చేస్తూ వారికి అండగా నిలిచారన్నారు. అనేక గ్రామాల్లో విశాక ట్రస్ట్ ద్వారా బోర్ వెల్స్ ఏర్పాటు చేయించారని, చాలా స్కూళ్లకు బెంచీలు, ఇతర ఉపయోగపడే వస్తువులను అందజేసిన ఘనత వివేక్ వెంకట స్వామి కుటుంబానిదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ జిల్లా ప్రజలకు, సింగరేణి కార్మికులకు చేసిందేమీ లేదని తెలిపారు. వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ చేసిన సేవలో కనీసం 10శాతం కూడా గోమాసే శ్రీని వాస్, కొప్పుల ఈశ్వర్ సేవ చేయలేదనే విష యాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని, ఆయన గెలుపును ఎవరు అడ్డుకోలేరని దీమా వ్యక్తం చేశారు.

వానరానికి అంత్యక్రియలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 24: రామగిరి మండలం వెంకట్రావుపల్లిలో వానరానికి ఆదివారం అంత్యక్రియలు జరిపారు. విద్యుదాఘాతానికి గురైన వానరానికి పశువైద్యులు చికిత్స చేసినప్పటికీ అది చనిపోయింది. చనిపోయి న కోతికి గ్రామస్తులు అంతిమ సంస్కారాలు నిర్వహించా రు. మాజీ ఎంపీటీసీ తిరుపతి, బీఆర్ఎస్ అధ్యక్షుడు బూడిద సమ్మయ్య మహిళలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

మార్కండేయకాలనీ, మార్చి 24: ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల జీవితాల ఆధారంగా రూపొందించిన ఆటో బతుకులు చిత్ర యూనిట్ పదిరోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించి చివరిరోజు ఆదివారం యాత్ర గోదావరిఖనికి చేరుకుంది. బస్టాండ్ ఏరియా ఆటో యూనియన్ నాయకులు చిత్ర యూనిట్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కు ఆర్టీసీ ఫ్రీ టికెట్ ఏర్పాటు చేయడం వల్ల, ఆటో కార్మి కులు ఉపాధి కోల్పోయారని, కొందరు ఆత్మహత్య చేసుకు న్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు కడాల శ్రీధర్, నాయకులు కాసిపేట రాజయ్య, ఆసంపల్లి తిరుపతి, ఎస్.కె నజీర్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ గంట పద్మ

రామగిరి, మార్చి 24: ఉచిత శిక్షణ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కల్వచర్ల మాజీ సర్పంచ్ గంటపద్మ అన్నారు. ఆదివారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి పద్మ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెము కనకయ్య, సేవా సమితి కార్యదర్శి ఉమాదేవి, బ్యూటిషన్ శిరీష పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం



రంగుల హోలీని పర్యావరణహితంగా జరుపుకోవాలి

- సీఎండీ ఎన్ బలరాం



గోదావరిఖని, మార్చి 24: రంగుల పండుగ హోలీని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగులందరికీ ఆదివారం హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ అందరి జీవితాల్లోనూ ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనిక రంగులు కాకుండా సహజ సిద్ధమైన రంగులతో పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన సూచించారు.

ఉద్యోగులకు సన్మానం



సింగరేణి ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం, కాంట్రాక్టర్లు

మార్కండేయకాలనీ, మార్చి 24: సింగరేణి సంస్థలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న, పదవీ విరమణ పొందనున్న అధికారులను ఆదివారం గోదావరిఖని ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో ఆర్‌జీ-1 సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై బదిలీపై వెళుతున్న పీ నాగేశ్వరరావు, పదవీ విరమణ పొందుతున్న కే కోటేశ్వర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి రాజలింగు, ప్రధాన కార్యదర్శి ఎ రాంరెడ్డి, ఎ రాజమొగిలి జి స్వామి, కూర్మ శ్రీనివాస్, కె భద్రయ్య, కొల్లూరి శ్రీనివాస్, జి తిరుపతి, జాని, చింతల సతీష్, కొల్లూరి విజయేందర్, జి కొండల్‌రావు, గంగరాజు పాల్గొన్నారు.

కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోంది: హెచ్ఎంఎస్

శ్రీరాంపూర్, మార్చి 24: ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ యూనియన్లతో కార్మికులకు తీవ్రనష్టం జరుగుతోందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రెండు యూనియన్లు పైరవీలు చేసుకుంటూ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఏరియాలో డిప్యూటేషన్ల దందా కొనసాగుతోందన్నారు. ఇటీవల నూతనంగా 20మందికిపైగా డిప్యూటేషన్‌పై వివిధ గనులకు పంపారని, దానికి కార్మికుల నుంచి అధికారులు, ఓ కార్మిక నాయకుడు లక్షల్లో డబ్బులు వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతోమంది అర్హులు దరఖాస్తు పెట్టుకున్నా వాటిని తిరస్కరించడం దారుణమన్నారు. వివిధ గనులు, విభాగాల్లో పనిచేసే మహిళా కార్మికులను పలువురు నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటి వారు తమ పద్ధతులు మార్చుకోక పోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈపీ ఆపరేటర్లకు నిబంధనల పేరిట ఆంక్షలు పెట్టకుండా బదిలీలుచేయాలని, ఎస్అండ్‌పీసీ విభాగంలో పర్మనెంట్ ఉద్యోగులన రిక్రూట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జీవన్ జోయల్, ఏరియా ఉపాధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి గోళ్ల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సంస్థ పరిరక్షణకు ఎంతటి త్యాగానికైనా సిద్ధం

- టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మార్చి 24: సింగరేణి సంస్థ పరిరక్షణకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఆయ న కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్మిక హక్కుల సాధన కోసం దశలవారీగా ఉద్యమ కార్యాచరణను అమలు చేయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 30మంది సభ్యులతో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. చర్చల కమిటీ ప్రతినిధులు, కేంద్ర కమిటీ కార్యవర్గ సభ్యులు, వివిధ డివిజన్ల ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు ఉంటారని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

కార్మిక సంఘం నిబంధనల మేరకు యూనియన్ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కార్మికవర్గ సంక్షేమం, కార్మిక కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తామని రాజిరెడ్డి వివరించారు. రాబోయే కాలంలో గని స్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఏప్రిల్ మాసంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించను న్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం గోదావరిఖనిలో జరిగిన టీబీజీకే ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ చేసిన తీర్మానాలను ఆయన వెల్లడించారు. సింగరేణి సంస్థలో కొత్తగా ఉద్యోగాలు కల్పించడానికి అనుగుణంగా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే కొత్త గనులు ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచే విధంగా పోరాట కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు. కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యుల కు మెరుగైన వైద్యం అందించడంలో యజమాన్యం వైఫల్యానికి నిరసన గా పోరాట కార్యక్రమాలు చేపట్టాలని, ఇటీవల కాలంలో సింగరేణి సంస్థ లు గని ప్రమాదాలు పెరిగి పోతుండడంపై సమావేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు మెరుగైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణిలో నూతన ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ రంగంలో కొత్తగనులు సింగరేణి ఆధ్వర్యంలో ప్రారంభించే విధంగా యజమాన్యం కార్యాచరణ ప్రారంభించాలని, బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని తీర్మానించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, జీవో ఎం.ఎస్ నంబర్ 22ను అమలు చేయాలని, సింగరేణిలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని తీర్మాణించారు.

సింగరేణిలోని ఖాళీలను అర్హులైన అంతర్గత అభ్యర్థులకు 80 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అర్హత నిబంధనలను సడలించాలని, సింగరేణి వ్యాప్తంగా కార్మిక కుటుంబాలకు రక్షిత మంచినీరు సరఫరా చేయాలని, కార్మికవాడలలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, సింగరేణి వ్యాప్తంగా సిబిఎస్ఈ స్కూళ్లను ప్రారంభించి, పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తీర్మానించారు. సమావేశంలో స్టీరింగ్ కమిటీ నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపెల్లి రవి, ఎల్ వెంకటేష్, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, చెలుకలపల్లి శ్రీనివాస్, పల్లె సురేందర్, సర్వోత్తమ్‌రెడ్డి, పులిపాక శంకర్, బొగ్గుల సాయి, ఉప్పులేటి తిరుపతి, గడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సవరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుర్ర తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 24: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను సవరించాలని, జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షడు బుర్ర తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆర్‌వీఆర్ కంపెనీలో యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో గౌస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాటాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుదల చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని, గత 16 సంవత్సరాలుగా రాష్ట్రంలో కనీస వేతనాల సవరణ జరుగలేదని అన్నారు. కార్మికులు తమ జీవితాలు బాగు పడుతాయని మార్పును కోరుకొని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా వేతన సరవణ అమలు చేయాలని తిరుపతి డిమాండ్ చేశారు. యాజమాన్యాలకు అనుకూలంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంకనీస వేతనాల నోటిఫికేషన్ విడుదల చేశారని, ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాల సవరణ ప్రతిపాదన జరుగలేదన్నారు. గత ప్రభుత్వం 2021 జూన్‌లో విడుదల చేసిన జీవో 22ను గెజిట్‌లో పెట్టకుండా పెండింగులో పెట్టిందనిఅన్నారు. మరో జీవోలను హైకోర్టు ఆదేశాల ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఓబీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని తిరుపతి డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను తెలియజేస్తూ ఈనెల 26న హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తామన్నారు. అన్నిడివిజన్ల నుంచి ఏఐటీయూసీ ప్రతిని ధులు పాల్గొని వినతిపత్రాలు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. స మావేశంలో ఎండీ రఫీక్ పాషా, భాస్కర్, కుమారస్వామి, కనకరాజు, శ్రీధర్‌గౌడ్, ప్రసాద్, సిరాజ్, సంపత్, మహేందర్, శ్రీనివాస్, ఓటీ కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, మార్చి 24: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పోషమ్మ అనే మహిళ కొన్ని రోజుల నుంచి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే విజయరమణారావు రూ.1,50,000 ఎల్ఓసీ కాపీని ఎలిగేడులో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, అప్పాల రవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పాటలు పాడుతున్న కళాకారులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 24: తెలంగాణ సంస్కృతి సారథి కళాబృందం కలెక్టర్ ఆదేశాలతో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెన్నంపల్లిలో ఆదివారం పరిసరాల పరిశుభ్రత, ఓటు హక్కు ప్రాముఖ్యతపై గ్రామస్థులకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్ గౌడ్, ఇల్లందుల మల్లేష్ గౌడ్, శైలేంద్ర రాజన్న, జిన్న రమ, కొండ శ్రావణ్, కన్నూరి రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.